పఠాన్‌బస్తీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి



జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన భోలక్‌పూర్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్

ముషీరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని పఠాన్‌బస్తీ అమీర్‌గరీబ్ వీధిలో 10ఏళ్లుగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, దీన్ని వెంటనే పరిష్కరించాలని భోలక్‌పూర్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వాజీద్‌హుస్సేన్ మాట్లాడుతూ... అమీర్‌గరీబ్, జర్‌జరాహోటల్ వీధిలో నిత్యం పొంగుతున్న మ్యాన్‌హోల్ మురుగునీటి వల్ల ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ జలమండలి డీజీఎం మోహన్ రాజ్, డాక్టర్ మినాజ్ పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజ స్థాపనకు కృషిచేయాలి



వైద్యశిబిరం ప్రారంభించిన ముషీరాబాద్ టీబీ యూనిట్ సూపర్‌వైజర్

ముషీరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషిచేయాలని ముషీరాబాద్ టీబీ యూనిట్ సూపర్‌వైజర్ శాంతి అన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం భోలక్‌పూర్ బడీమసీదు వద్ద బైబిల్‌హౌస్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ నిర్ధారణ పరీక్షలు, వ్యాధిపట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ పీహెచ్‌ఎన్ వనిత, ఏఎన్‌ఎం లక్ష్మీబాయి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

● రాంనగర్‌లో వర్షం



ముషీరాబాద్‌లో గురువారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై సాయంత్రం భారీ వర్షం పడింది. రోడ్లపై వర్షం నీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆగకుండా వర్షంపడడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు.
- ముషీరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి)

కిలిమంజారో అధిరోహకుడికి సత్కారం



కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి, రికార్డు సృష్టించిన నగరానికి చెందిన పర్వతారోహకుడు ఎ.మనీష్‌యాదవ్‌ను గురువారం టీడీపీ నగర కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా, నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, శ్రీనివాస్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్, కిరణ్, శ్రీనివాస్‌నాయుడు, శుక్లవేది, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

నేడు మాల మహర్ సర్వసభ్య సమావేశం

చిక్కడపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాల మహర్ నేషనల్ జాయింట్ యాక్షన్ కమిటీ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు బాగ్‌లింగంపల్లి వీఎస్టీ యూనియన్ కార్యాలయంలో జరుగుతుందని కమిటీ చైర్మన్ మాస్టర్ దయానంద్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని మహర్ నేషనల్ జేఏసీ కార్యాలయంలో దయానంద్ విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు తీరని అన్యాయం జరిగిందని తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ జరగాలన్నారు. వీఎస్టీ యూనియన్ కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశంలో మాలల భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు దసరాలోపు బోనస్ చెల్లించాలి

నల్లకుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని ఆర్టీసీ ఉద్యోగులందరికీ 2024 - 2025 సంవత్సరానికి గాను బోనస్ చెల్లించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయుసీఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యం, ఎస్.ఎల్.పద్మ డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని టీయూసీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి పరిశ్రమ, కంపెనీలోనూ యాజమాన్యాలు తమ ఉద్యోగులకు దసరా, దీపావళి పండుగ సందర్భాలలో బోనస్ చెల్లించడం కొనసాగుతుందన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు బోనస్ చెల్లింపు తక్షణమే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

రైలు ఎక్కబోతూ జారిపడి వ్యక్తి మృతి

బర్కత్‌పుర, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నడుస్తున్న రైలు ఎక్కబోయి ప్రమాదవశాత్తు జారిపడి, తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... అనంతపురం జిల్లాకు చెందిన హనుమంతు కుమారుడు జోగిఎర్రిస్వామి(41) బుధవారం రాత్రి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. కదులుతున్న ఎల్లంకి ఎక్స్‌ప్రెస్ రైలెక్కబోయి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో రైల్వే పోలీసులు ఆస్పత్రిలోచేర్పించారు. చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలులో బంగారు ఆభరణాల చోరీ

రైలు ప్రయాణికుడి బంగారు ఆభరణాలను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. నగరానికి చెందిన ప్రవీణ్‌కుమార్ బికనూర్ - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. మహారాష్ట్రలోని మోత్కేడ్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆయన బ్యాగును దొంగలు తస్కరించారు. ఈ బ్యాగులో 12 గ్రాముల బంగారు ఆభరణాలు, ఆధార్ కార్డు ఉన్నాయి. గురువారం ప్రవీణ్‌కుమార్ కాచిగూడ రైల్వే పీఎస్‌లోఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

డ్రగ్స్ నియంత్రణలో ప్రభుత్వం విఫలం: పీవైఎల్

నల్లకుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మత్తు పానీయాల నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాకేష్, పెద్దింటి రామకృష్ణ ఆరోపించారు. గురువారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పీవైఎల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా బీరు, బ్రాందీ వైన్‌షాపులకు పర్మిషన్ ఇస్తూ వ్యాపారులకు మేలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌ను నిర్మూలించడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భారత్, రవికుమార్, సహాయ కార్యదర్శులు కృష్ణ, రామకృష్ణ, కోశాధికారి నవీన్, నాయకులు ప్రేమ్‌సింగ్, కొల్లూరు భీమేష్, కరుణాకర్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



ముషీరాబాద్ సీఐ రాంబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేగోపాల్

ముషీరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులను, నిరుద్యోగులను, బీఆర్‌ఎస్ నేతలను వెంటనే విడుదలచేయాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం గ్రూప్-1, జాబ్ క్యాలెండర్‌పై విద్యార్థులు, నిరుద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా నిరసన తెలిపిన బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నిరుద్యోగులను అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ యువనాయకుడు ముఠా జైసింహ, నాయకులతో కలిసి అరెస్టైయిన నేతలను పరామర్శించారు. వారిని వెంటనే విడుదల చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అవకతవలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రూప్-1 పరీక్షలు మళ్లీ నిర్వహించి, విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, పార్టీ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, పార్టీ నాయకులు పూసగోరక్‌నాథ్, శ్రీకాంత్‌యాదవ్, రాజేందర్ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకం

ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్



రామకృష్ణమఠంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌ను సత్కరించిన స్వామి బోధమానందా, నిత్యముక్తానందస్వామి తదితరులు

కవాడిగూడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకమని ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం రామకృష్ణమఠంలోని వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన స్వామి వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్సీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా సంప్రీతి దివాస్ పేరిట యూత్ కన్వెన్షన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో రామకృష్ణమఠంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్వామి వివేకానంద ప్రసంగంలో భారతదేశ ఆధ్యాత్మికత, సహనం ఐక్యత వంటి అంశాలను ప్రపంచానికి చాటారని అన్నారు. యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి రావాల్సినప్పటికీ వివిధ కారణాలతో హాజరు కాలేకపోయారని భవిష్యత్‌లో సీఎంను తీసుకొచ్చే బాధ్యత తనదేనని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమానందా కోల్‌కత రామకృష్ణమఠం అధ్యక్షుడు నిత్యముక్తానంద స్వామి, మఠం సేవలను వివరించారు. అనంతరం ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌ను సత్కరించి మెమెంటోను బహూకరించారు.



తుప్పుపట్టిన స్తంభాన్ని పరిశీలిస్తున్న బీజేపీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు టి.నరేష్‌గౌడ్, స్థానికులు

తుప్పుపట్టిన కరెంట్ స్తంభం తొలగింపు

అంబర్‌పేట, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి):అంబర్‌పేట డివిజన్‌లోని నరేంద్రనగర్‌లో తుప్పుపట్టిన కరెంట్ స్తంభాన్ని తొలగించి, వెంటనే మార్చాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు టి.నరేష్‌గౌడ్ ట్రాన్స్‌కో అధికారులను కోరారు. ఇందుకు స్పందించిన అధికారులు గురువారం నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమస్యను వెంటనే ట్రాన్స్‌కో అధికారులు పరిష్కరించడంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

నిశ్శబ్ద మాధుర్యం కవితాసంపుటి ఆవిష్కరణ



సంపుటిని ఆవిష్కరిస్తున్న డా.గోపి తదితరులు

చిక్కడపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కవిత్వం వస్తుప్రాధాన్యంగా ఉంటుందని ప్రముఖ కవి డా.ఎన్ గోపి అన్నారు. సమాజ సంఘటనలకు స్పందించి తన కవిత్వంలో వాటిని వ్యక్తీకరించడం వల్లే శ్రీశ్రీ ప్రపంచ బాధ తన బాధగా పేర్కొంటారని తెలిపారు. వంశీ-సినారె విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో జి.సాయి చంద్రశేఖర్ రచించిన నిశ్శబ్దమాధుర్యం కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన డా.గోపి మాట్లాడుతూ సమాజాన్ని చదవకపోతే కవి కాలేడన్నారు. సభను ప్రారంభించిన వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా స్థాపకుడు ప్రఖ్యాత వ్యంగ్య రచయిత వంగూరి చిట్టెన్‌రాజు మాట్లాడుతూ కవితాసంపుటికి చంద్రశేఖర్ నిశ్శబ్ద మాధుర్యం పేరు ఎంచుకోవడంలోనే వైవిధ్యం ఉందన్నారు. సాహితీవిమర్శకులు డా.రఘు సభకు అధ్యక్షత వహించగా ప్రముఖ కవి డా.జి.ఆదినారాయణ, వంశీ రామరాజు, డా.తెన్నేటి సుధ, పణి, జ్యోతిర్లత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఫంక్షన్‌ను ఖాళీ చేస్తున్న అధికారులు

ఎంఏ గార్డెన్ ఫంక్షన్ హాల్ సీజ్

రాంనగర్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హైదర్‌గూడలో గగన్‌మహల్ విలేజ్ పరిధిలోని టీఎస్ నెంబర్ 19 బ్లాక్ ఎల్ వార్డ్ 54లోని ప్రభుత్వ స్థలంలో రెండు దశాబ్దాలుగా అక్రమంగా కొనసాగుతున్న ఎంఏ గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారులు గురువారం సీజ్‌చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కిషన్ సింగ్ అనే వ్యక్తి 20 సంవత్సరాలుగా 560 గజాలస్థలంలో ఎంఏ గార్డెన్ ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నాడు. ఈ స్థలంపై ప్రభుత్వానికి అతని మధ్య కోర్టులో వివాదం కొంతకాలంగా కొనసాగుతుంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఆర్డీవో రామకృష్ణ, హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి పోలీసుల బందోబస్తు మధ్య ఫంక్షన్ హాల్‌ను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ ఈ స్థలం విలువ రూ.20కోట్లు ఉంటుందన్నారు. ఫంక్షన్ హాల్ సీజ్ సందర్భంగా రెవెన్యూ అధికారులు, ఫంక్షన్ హాల్ యాజమాన్యం మధ్య వాగ్వివాదంతో కొంత ఉద్రిక్తత నెలకొంది.

రెస్టారెంట్ తనిఖీ

రాంనగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని గోల్కొండ చౌరస్తా మెయిన్ రోడ్‌లో ఆల్ సౌద్ ఏ వన్ మండీ అరేబియన్ మండీ రెస్టారెంట్‌లో జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. రెస్టారెంట్‌లో మారేడ్‌పల్లికి చెందిన ఇద్దరు బిర్యానీ తింటుండగా అందులో బొద్దింక ఉన్నది. దీంతో బాధితులు జీహెచ్‌ఎంసీ, స్థానిక ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి ఆదేశాల మేరకు ఫుడ్‌సేఫ్టీ అధికారులు రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ హోటల్ కిచెన్‌లో ఉన్న అపరిశుభ్రతతోపాటు ఫ్రిజ్‌లో ఉన్న ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించారు.



పారిశుధ్య కార్మికులకు రిక్షాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఏఎంవోహెచ్ డాక్టర్ హేమలత తదితరులు

పారిశుధ్య కార్మికులకు రిక్షాలు పంపిణీ

అంబర్‌పేట, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు అలుపెరగకుండా పనిచేస్తున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని 50 మంది పారిశుధ్య కార్మికులకు చెత్త రిక్షాలను గురువారం అంబర్‌పేట స్విమ్మింగ్‌పూల్ వద్ద ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ నేతలకు సన్మానం



బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ ఓ.శ్రీనివాస్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శిగా నియమితులైన ఏడెల్లి అజయ్‌కుమార్‌ను బాగ్‌అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు పి.నాగరాజాచారి ఆధ్వర్యంలో డీడీ కాలనీలో గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.గోవర్ధన్‌రెడ్డి, కృష్ణగౌడ్, మల్లేష్, దత్తు ముదిరాజ్, చుక్క జగన్, అచ్చిని రమేష్, చంద్రశేఖర్, సి.మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

17ను బీఎస్‌ఆర్‌ఎస్ దినోత్సవంగా జరపాలి : బీఎల్‌పీ

చిక్కడపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 17ను తెలంగాణలో బహుజన శ్రామిక రాజ్యాధికార సాధన(బీఎస్‌ఆర్‌ఎస్) దినోత్సవంగా జరపాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ పిలుపునిచ్చారు. చిక్కడపల్లిలో గురువారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహుజన శ్రామిక కమ్యూనిస్టు గెరిల్లా యోధుల బలిదానాలను హిందూ ముస్లిం పోరాటంగా చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందన్నారు. ఈ విధానాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వారు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు.

అలరించిన బాలు సినీసంగీత విభావరి



రామోజీకి అవార్డ్‌ను ప్రదానం చేస్తున్న వంశీరామరాజు

చిక్కడపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం యాదిలో పేరిట త్యాగరాయ గానసభలో నిర్వహించిన తెలుగు, హిందీ సినీసంగీత విభావరి అలరించింది. బహుగళ గాయకుడు రామోజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ విభావరిలో గాయనీగాయకులు బాలు పాడిన గీతాలను ఆరుగంటలపాటు ఆలపించి అలరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రామోజీకి వంశీ- ఎస్పీ బాలు గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్-2025 వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా హాజరై, ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు వెంకటేశ్వరరావు, మధురవీణ, కల్యాణి, రుషి, రాధిక, ప్రణీత, భారతి, ధరణి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

చిక్కడపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలోని దత్తాత్రేయస్వామి సాయిబాబా మందిరంలో సిద్ధి, బుద్ధి సహిత వినాయక స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నామని ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ఈవో దేవనాథం తెలిపారు. వారు ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. భక్తుల అభిప్రాయాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



కవాడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న జగతి ఫౌండేషన్ కార్యదర్శి రాంచందర్‌రావు, హెచ్‌ఎం మీనాకుమారి

కవాడిగూడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆ దిశగా విద్యార్థులు కృషిచేయాలని జగతి ఫౌండేషన్ కార్యదర్శి రాంచందర్‌రావు అన్నారు. గురువారం కవాడిగూడ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా షూ పంపిణీ, శానిటేషన్ కిట్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈందర్భంగా ఉన్నతపాఠశాల హెచ్‌ఎం బి.మీనాకుమారి మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, సుబ్రమణ్యం, జాని, డాక్టర్ బి.నాగయ్య, సలావుద్దీన్, ఐశ్వర్య పాల్గొన్నారు.

తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చట్టం రద్దు చేయాలి

కవాడిగూడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని రద్దు చేయాలని ఏఐసీసీ న్యూ ఢిల్లీ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌లో ఉన్న రాహుల్‌గాంధీ మాజీ పీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సలహా మండలి చైర్మన్ కొప్పుల రాజుకు వినతిపత్రం అందజేశామని మాలమహానాడు జాతీయ గౌరవ అధ్యక్షుడు, సుప్రీంకోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్షణమే ఎస్సీ వర్గీకరణ చట్టం రద్దుచేయకపోతే తెలంగాణలో కాంగ్రెస్‌కు గడ్డుకాలం తప్పదని అన్నారు. అధిష్ఠానం, రాహుల్‌గాంధీ, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి నటరాజన్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చినట్లు కృష్ణస్వరూప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జేఎస్‌రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రాయప్ప పాల్గొన్నారు.

నారాయణదాసు హరికథకులకు మార్గదర్శనం

చిక్కడపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల నారాయణదాసు హరికథా కళాప్రక్రియను మలిచిన తీరు తదుపరి హరికథకులకు మార్గదర్శనం చేసిందని వేంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ, ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. నారాయణదాసు హరికథా కళాప్రక్రియకు తొలివారు కాకున్నా ఆయన ఈ ప్రక్రియను రూపొందించిన తీరుతో ఆయన హరికథా పితామహుడుగా గుర్తింపునొందారన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం ఎందరో మహానుభావులు శీర్షికన జరుగుతున్న కార్యక్రమాల పరంపరలో భాగంగా ఆదిభట్ల నారాయణదాసు యాదిలో పేరిట సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ నారాయణదాసు విజయనగరం మజ్జాడ గ్రామంలో జన్మించారని అందుకే ఆయన ఇంటిపేరు ముందు మజ్జాడ కలిపి పిలుస్తారన్నారు. కళాపోషకులు శ్రీమణి, వి.వెంకటరావు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం



గౌతమ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ఎక్కాల నందు తదితరులు

బర్కత్‌పుర, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ఆరోపించారు. గ్రేటర్ సమస్యలపై ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గా డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్యదర్శిగా ఓ.శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన జి.ఆనంద్‌గౌడ్‌ను గురువారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎక్కాల నందు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన ఈ ముగ్గురు నేతలను శాలువా, పూలబొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ వంద కార్పొరేటర్ స్థానాలను కైవసం చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీనేతలు నందకిషోర్‌యాదవ్, ఎక్కాల కన్నా, ఏడెల్లి అజయ్‌కుమార్, శ్యామ్‌రాజ్ ముదిరాజ్, రవీందర్, బల్వీర్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులను తక్షణమే పూర్తి చేయాలి

బర్కత్‌పుర, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల పనులను తక్షణమే పూర్తిచేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అధికారులను ఆదేశించారు. గురువారం డివిజన్ పరిధిలోని కాచిగూడ చౌరస్తా, శాంతినికేతన్ స్కూల్ వీధిలో జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ ప్రశాంత్‌తో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా సీసీ రోడ్డు పనులను పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు భీమ్‌రాజ్, వాసు, రాజ్‌కుమార్, మల్లికార్జున్, రవియాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నేతకు సన్మానం

చిక్కడపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరగడంలో కృషి చేసిన భాగ్యనగర్ గణేశ్ ఉత్సవసమితి సెంట్రల్ కమిటీ సభ్యులు ఎ.వినయ్‌కుమార్‌ను గురువారం సన్మానించారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగానికి చెందిన జవాన్లు, ఎస్ఎఫ్ఏలు, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మించిన ఇల్లు కూల్చివేత

రాంనగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ నిబంధనలకు గోల్నాకలో నిర్మించిన ఇంటిని జీహెచ్‌ఎంసీ అధికారులు గురువారం కూల్చివేశారు. అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని గోల్నాక డివిజన్‌లోని జిందాతిలిస్మాత్‌నగర్ ప్రాంతంలోని ఇంటి నెంబర్ 2-3-792బై13బై2బైసి యజమాని నిబంధనలకు విరుద్ధంగా ఇల్లు నిర్మించారని ఫిర్యాదు అందింది. దీంతో అసిస్టెంట్ సిటీ ప్లానర్ వై.కృష్ణకుమారి పర్యవేక్షణలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట సర్కిల్ అధికారులు సత్యవర్ధన్, అశ్విన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.